


## నెలనెలా నవ్వుల పండగ

## మల్లాది వెంకటకృష్ణమూర్తి స్పెషల్

నేను ఫేస్‌బుక్ బయట అదే నియమాలతో మిత్రులని చేసుకునే ప్రయత్నం చేసాను. ప్రతీరోజు నేను దారిలో వెళ్ళే వాళ్ళతో భోజనం చేసానని చెపుతూ, ఆ సమయంలో ఎలా ఫీలయ్యానో, తర్వాత ఎవరితో ఏం చేస్తానో చెప్పసాగాను. వారికి నా భోజనం, నా కుటుంబ సభ్యుల ఫోటోలని, నేను లాన్‌కి నీళ్ళు పట్టడాన్ని, నా కుక్క ఫోటోని చూపిస్తూ వాళ్ళు మాట్లాడే దానికి థంప్స్ అప్‌ని చూపించి వాళ్ళని లైక్ చేస్తానని చెప్పసాగాను.

ఫేస్‌బుక్‌లానే అదీ పని చేసింది. నన్నిప్పటికే నలుగురు ఫాలో అవుతున్నారు. ఇద్దరు పోలీస్ ఆఫీసర్లు, ఓ ప్రైవేట్ డిటెక్టివ్, ఓ సైకియాట్రిస్ట్.

---

ఆమె ఓ పార్క్ లో తన దగ్గరకి వచ్చిన వ్యక్తి ఇచ్చిన ఉత్తరాన్ని చదివి, ముక్కలుగా చింపి అతని చెంపమీద కొట్టి చెప్పింది.

"ఇంకెప్పుడూ నా దగ్గర ప్రేమా, దోమా అనకు."

అతను కూడా వెంటనే ఆమె చెంప మీద కొట్టి అడిగాడు.

"ఎందుకు కొట్టానో తెలుసా? కాగితం ముక్కలు ఏరు. స్వచ్ఛభారత్ గురించి నీకు తెలీదా?"

---

చౌచౌ... ## ఏరుకొచ్చిన నవ్వులు

"రేడియో వలన ఎక్కువ లాభమా? వార్తా పత్రికలవలన ఎక్కువ లాభమా?"

"వార్తా పత్రికల వలన"

"ఎందుకని?"

"వాటితో విసురుకోవచ్చు, పొట్లాలు కట్టుకోవచ్చు తూకం వేసి అమ్ముకోవచ్చు"

❦❦❦

అది ఒక ప్రజంటేషను చేయడానికి వీలైన వస్తువులమ్మే షాపు. ఒకరోజు ఆ షాపు యజమాని అర్జంటుగా పిల్లనిచ్చిన మామ చనిపోతే వెళ్ళాల్సి వచ్చింది. అందుకని వస్తువులన్నీ పట్టీరాసి, అన్ని వస్తువుల మీద ధర వేసి దాని ప్రకారం అమ్మమని గుమస్తా భజగోవిందానికి చెప్పి మరీ ఊరెళ్ళాడు.

దహన సంస్కారాలు అయిన తక్షణమే తిరిగివచ్చి ఏమేమి అమ్మాడో లిస్టు ప్రకారం అడుగుతున్నాడు భజగోవిందాన్ని.

"ఇక్కడున్న బొమ్మ ఎంతకు అమ్మావ్?"

"దానిమీద ఇరవై ఐదు అని వేసి ఉంది. అందుకని ఇరవై ఐదు పైసలకమ్మాను" అన్నాడు భజగోవిందం భయంగా.

"అది ఇరవై ఐదు రూపాయల వస్తువురా! ఇరవై ఐదు పైసలకు ఎలా అమ్మావ్? ఒళ్ళు దగ్గర పెట్టుకుని అమ్ము ఇకమీదట" అని మరీ కోపంగా మాట్లాడాడు యజమాని.

"క్షమించండి సార్ పొరపాటైంది" అన్నాడు భజగోవిందం.

"సరేలే ఇకనైనా జాగ్రత్తగా ఉండు. ఇప్పుడైనా ఒక ఐదు పైసలు లాభం వచ్చిందనుకో" అన్నాడు యజమాని.

❦❦❦

నీ పెళ్ళయిన తరువాత ఎప్పుడైనా ధైర్యంగా నీ భార్యతో మాట్లాడేవటోయ్?'

"ఎందుకు లేదు. ఒకసారి ఫోనులో మాట్లాడాను."

❦❦❦

"హలో! నారాయణరావుగారున్నారా?"

"ఉండండి, ఒక్క నిమిషం.. ఆహా.. లేరండీ"

"చూడండి. ఇప్పుడు మీతో లేరని చెప్పమన్నాడు చూశారా, ఆయన్ని కొంచెం మాట్లాడమంటారా! నాకివ్వాల్సిన బాకీ సంగతి మాట్లాడాలి"

❦❦❦

తిరుపతికి వస్తూ ఒక వ్యక్తి క్యూలో నిలబడకుండా నేరుగా దేవుణ్ణి చూట్టానికి ఓ మంత్రిగారి వద్దనుండి విలువైన రికమండేషను పట్టుకువచ్చాడు. వారు వెంటనే ఆయన్ని క్యూలో నిలబడమని చెప్పారు.

"డైరెక్టుగా స్వామి దర్శనం కొరకు నేను వస్తే అంత పెద్ద క్యూలో నిలబడమంటారేమిటయ్యా?" అని దబాయించాడు ఆ వ్యక్తి.

"అవునయ్యా! క్యూతో నిమిత్తం లేకుండా అర్జంటుగా దేవుడి దర్శనం చేసుకోవడానికి వచ్చిన వాళ్ళక్యూ అదే. వెళ్ళి ఆ చివర్న నిలబడు" అని గదమాయించారు అధికారులు.

❦❦❦

ఆరోజు తుపానుగా వుంది. ఉరుములు విపరీతంగా ఉరుముతున్నాయి. పిడుగులు కూడా పడుతున్నాయి. అలాంటి సమయంలో తన తొమ్మిది ఏళ్ళ కొడుకు నిద్రనుండి లేచి భయపడతాడని అనసూయమ్మ కొడుకు పక్కనే కూర్చుంది.

కొద్దిసేపటికి ఆ పిల్లవాడు నెమ్మదిగా కళ్ళు తెరిచి మొహం చిట్లించి ఇలా అన్నాడు – "ఇప్పుడెందుకే రేడియో పెట్టావు నిద్రపోనీకుండా!"

❦❦❦

"బట్టతల వలన ఏదైనా లాభం ఉందా?"

"ఎందుకు లేదు. ఎవరైనా ఆడాళ్ళు కనిపిస్తే దువ్వెన తీసి దువ్వాల్సిన అవసరం ఉండదు."

"నష్టం?"

"పౌడరు, స్నో, సబ్బు ఎక్కువగా ఉపయోగించాల్సి ఉంటుంది."

❦❦❦

'జూ ' చూడటానికి వెళ్ళాడో ఆసామి. అందులో ఒకే బోనులో సింహం, మేక రెండూ కలసి ఉండటం ఆయన్ని ఆశ్చర్యపరిచింది. వెంటనే అక్కడున్న జూ అధికారిని కలిసాడు. "నిజంగా ఈ సింహం, మేక సహజీవనం చూడండి, ఇది సృష్టికే విరుద్ధం. ప్రపంచంలోనే ఒక వింత. ఇంతకీ ఇదెలా సాధ్యం అంటారు?" అన్నాడు అచ్చెరవొందుతూ.

"ఏముంది? ఆ బోనులోకి రోజుకొక మేకనొదిలితే సరి" అన్నాడు పైపు వెలిగిస్తూ ఆ జూ అధికారి.

❦❦❦

"ఆ సుబ్బాయమ్మ కెంత వళ్ళు బరువంటే కనీసం కాఫీ కూడా పెట్టుకోలేదు వదినా!"

"మరి కాఫీ ఎలా చేస్తుంది?"

"నోట్లో కాఫీ పొడి వేసుకుని పాలు తాగుతుంది."

"ఆయన ఏం చెప్పినా దేశమంతా వింటారు"

"ఇంతకీ ఆయన ఏం చేస్తారు?"

"రేడియో అనౌన్సరు"

COMMENTS